

కేసీఆర్‌ను కలిసిన బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షురాలు, ఎంపీ కవిత, మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్

## కేసీఆర్‌ను కలిసిన ఎంపీ, మాజీ ఎమ్మెల్యేలు

జనగామ (నమస్తేతెలంగాణ)/ నర్సింహులపేట, డిసెంబర్ 7 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌ను గురువారం ఎర్రవల్లిలోని ఫాంహౌస్‌లో ఎంపీ, జిల్లా అధ్యక్షురాలు మాలోత్ కవిత, డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్, జనగామ మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి మర్యాదపూర్వకంగా కలిశారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం డోర్నకల్, జనగామ నియోజకవర్గాల్లో జరిగిన పరిణామాలు, ఎన్నికల్లో చేసిన కృషిని వారు కేసీఆర్‌కు వివరించారు. కాగా, జనగామ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ విజయం సాధించడంపై కేసీఆర్ ముత్తిరెడ్డిని అభినందించారు.



కేసీఆర్‌తో మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి

# ఎల్బీ కాలేజీది ఘన చరిత్ర

- ఎందరో పేద విద్యార్థులను విద్యా కుసుమాలుగా తీర్చిదిద్దింది
- కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్
- ఘనంగా లాల్ బహదూర్ కాలేజీ గోల్డెన్ జూబ్లీ వేడుకలు

హనుమకొండ చౌరస్తా, డిసెంబర్ 7 : లాల్ బహదూర్ కళాశాలకు ఎంతో ఘన చరిత్ర ఉన్నదని కేయూ వీసీ ప్రొఫెసర్ తాటికొండ రమేశ్ అన్నారు. లాల్ బహదూర్ కాలేజీ 50 సంవత్సరాల గోల్డెన్ జూబ్లీ వేడుకలను గురువారం కాలేజీ చైర్మన్ కే నిరంజన్ అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వేలాది మంది పేద విద్యార్థులు ఉన్నత స్థాయిలో స్థిరపడేందుకు ఇక్కడి అధ్యాపకులు, యాజమాన్యం చేసిన కృషి మరువలేనిదన్నారు. నిష్ణాతులైన అధ్యాపకులు ఉండడం వల్ల ఈ కళాశాలలో అడ్మిషన్ పొందితే ఉద్యోగం దొరికినంత సంబురంగా ఉండేదని, ఇప్పటికీ నాటి నాణ్యతా ప్రమాణాలు కొనసాగించడం సంతోషమని పేర్కొన్నారు. అలాగే యూనివర్సిటీతో పోటీబడ్డ ఏకైక కాలేజీ అని అన్నారు. దీన్ని గొప్పగా తీర్చిదిద్దిన అధ్యాపకులు, ఉస్మానియా గ్రాడ్యుయేట్స్ అసోసియేషన్, హైదరాబాద్ నిర్వాహకులకు కృతజ్ఞతలు తెలిపారు. 10వ తెలంగాణ బెటాలియన్ కమాండింగ్ ఆఫీసర్ అజయ్‌నంద కండూరి కాలేజీ పేరు ప్రతిష్టలను కొనియాడారు. కాలేజీ విద్యార్థుల ఉజ్వల భవిష్యత్ కోసం అన్ని రకాల ఆర్థికసాయం అందిస్తున్నామని తెలిపారు. మరిన్ని నూతన అవకాశాలను విద్యార్థులకు కల్పిస్తామని సెక్రటరీ ఈ రాజేందర్ తెలిపారు. విద్యతో పాటు ఎన్‌సీసీ, క్రీడలు, సామాజిక సేవా రంగాల్లో లాల్ బహదూర్ కళాశాల నగరానికే ఆణిముత్యమని 50 సంవత్సరాల ఘనకీర్తిని ప్రిన్సిపాల్ అరుణ వివరించారు. గోల్డెన్ జూబ్లీ ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందరినీ ఆకట్టుకున్నాయి. అనంతరం 50 వసంతాల ప్రత్యేక లోగోను వీసీ రమేశ్ చేతుల మీదుగా ఆవిష్కరించారు. కార్యక్రమంలో హైదరాబాద్ ఎగ్జిబిషన్ సొసైటీ వైస్ ప్రెసిడెంట్ సత్యేంద్ర వనం, చైర్మన్ కే నిరంజన్, సెక్రటరీ ఈ రాజేంద్రకుమార్, ట్రెజరర్ బొళ్ల ఆనందకుమార్, జాయింట్ సెక్రటరీ జీఎం రమేశ్, శకుంతల, జ్యోత్స్న, వినయ్‌కుమార్, నరేశ్‌కుమార్ పాల్గొన్నారు.




ఎల్బీ కాలేజీ గోల్డెన్ జూబ్లీ వేడుకల్లో 50 సంవత్సరాల లోగోను ఆవిష్కరిస్తున్న కేయూ వీసీ ప్రొఫెసర్ రమేశ్, కాలేజీ కమిటీ సభ్యులు, ప్రిన్సిపాల్

# రామాయణం.. జీవన విధాన దిక్సూచి

- శ్రీరామ చరిత నాగరికతకు మార్గదర్శి
- రామకోటి రచనల కోసమే రామస్తూపం
- దేవానంద రామానుజజీయర్
- జీడికల్‌లో రామస్తూపం ఆవిష్కరణ

లింగాలఘనపురం, డిసెంబర్ 7 : రామాయణం మానవాళి జీవన విధానానికి దిక్సూచి అని, శ్రీరామ చరిత నాగరికతకు మార్గదర్శి అని దేవానంద రామానుజ జీయర్ అన్నారు. మండలంలోని జీడికల్‌లో నిర్మించిన రామస్తూపాన్ని గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీరామ చంద్రుడు 11 వేల ఏళ్లు రాజ్యపాలన చేశాడన్నారు. ఆయన సుపరిపాలననే ప్రజలంతా ప్రామాణికంగా తీసుకుంటారన్నారు. ఆయన కాలంలో రూపొందించిన చట్టాల్లో కొన్ని నేటికీ అమలులో ఉన్నాయన్నారు. వేల రచనలతో ఉన్న రామగ్రంథాన్ని ప్రతి రోజూ పఠిస్తే తప్పకుండా మంచి జరుగుతుందన్నారు. చాలా మంది దీక్షలు బూని రామకోటిని రచిస్తారన్నారు. వాటిని సమర్పించాలంటే ఆయా దేవాలయాల్లో తప్పనిసరిగా రామస్తూపం ఉండాలన్నారు. అలాంటి భక్తుల సౌకర్యార్థం జీడికల్‌లో రామస్తూపాన్ని ఆవిష్కరించామని తెలిపారు. రామకోటి రచనలను ఇప్పటివరకు భద్రాచలంలో సమర్పించేవారన్నారు. పితృవాక్య చరణ, ప్రజల సౌలభ్య పాలనే రాముడి విధానాలన్నారు. నేటి పాలకులు ఆయనను ఆదర్శంగా తీసుకుని పాలన కొనసాగించాలన్నారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ కొండబోయిన కిరణ్‌కుమార్, ఈవో శేషుభారతి, వంశపారంపర్య ఆస్థాన పూజారులు గట్టు రంగాచార్యులు, శ్రీనివాసాచార్యులు, పూజారులు మురళీకృష్ణమాచార్యులు, భార్గవాచార్యులు, రాఘవాచార్యులు, ఆచార్య వర్చిశ్, బుచ్చయ్యశర్మ, సిబ్బంది కేకే రాములు, భరత్‌కుమార్, మల్లేశం పాల్గొన్నారు.



జీడికల్‌లో రామ స్తూపాన్ని ఆవిష్కరిస్తున్న దేవానంద రామానుజజీయర్

## ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాలకు భుజేందర్‌కు ఆహ్వానం

పాలకుర్తి, డిసెబర్ 7 : అంతర్జాతీయ శ్రీశ్రీ కళావేదిక ఆధ్వర్యంలో ఈ నెల 16,17 తేదీల్లో పశ్చిమగోదావరి జిల్లా తాడేపల్లిగూడెంలో నిర్వహించే ప్రపంచ తెలుగు సాహిత్య కళా ఉత్సవాలకు మండలంలో బమ్మెర గ్రామానికి చెందిన కవి, కళాకారుడు, పోతన సాహిత్య కళావేదిక అధ్యక్షుడు మాన్యపు భుజేందర్‌కు ఆహ్వానం అందింది. శ్రీశ్రీ కళావేదిక జాతీయ కన్వీనర్ రమావతి, అంతర్జాతీయ అధ్యక్షుడు కత్తిమండ ప్రతాప్ గురువారం భుజేందర్‌కు ఆహ్వాన పత్రిక ఆందజేశారు. తాడేపల్లిగూడెంలో 30 గంటల 30 నిమిషాల 30 సెకండ్ల పాటు జరగబోయే సకల కళా ప్రదర్శనలో భుజేందర్ కవితాగానం చేయనున్నారు. గతంలో సాహితీ బ్రహోత్సవాల్లో 48గంటల పాటు జరిగిన ప్రపంచ స్థాయి కళా ఉత్సవాల్లో ఆయన పాల్గొన్నారు.



## ‘మేడారం’ పనులపై పీవో సమావేశం

- టెండర్ల ప్రక్రియపై దృష్టి సారించాలని ఆదేశం
- హాజరైన ఇంజినీరింగ్, ఇతర శాఖల అధికారులు

ఏటూరునాగారం, డిసెంబర్ 7 : వచ్చే ఏడాది ఫిబ్రవరి 21 నుంచి 24 వరకు నిర్వహించబోయే మేడారం మహా జాతరకు సంబంధించిన పనులు, నిర్వహణపై గురువారం ఐటీడీఏ కార్యాలయంలో పీవో అంకిత్ వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గిరిజన సంక్షేమ, పంచాయతీరాజ్, ఐసీఏడీ, ఆర్‌డబ్ల్యూఎస్, ఆర్‌అండ్‌బీ, దేవాదాయ శాఖ ద్వారా గుర్తించిన సివిల్ పనులపై చర్చించారు. ఎంసీసీ కోడ్ పూర్తయిన నేపథ్యంలో టెండర్ల ప్రక్రియకు సంబంధించిన పనులకు ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. సమావేశంలో వివిధ విభాగాల ఇంజినీరింగ్, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అంకిత్

## ఎనుమాముల మార్కెట్‌కు కొత్త మిర్చి రాక

**క్వింటాల్‌కు రూ.28వేల 500**

కాశీబుగ్గ, డిసెంబర్ 7 : వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌కు గురువారం కొత్త మిర్చి వచ్చింది. మిర్చి సీజన్ జనవరి నుంచి ప్రారంభం కానుండగా ముందుగానే కొత్త మిర్చి వచ్చినట్లు అధికారులు తెలిపారు. కరీంనగర్ జిల్లా వేములవాడ మండలంలోని రామన్నపేట గ్రామానికి చెందిన రైతు తిరుపతిరెడ్డి వండర్‌హాట్ రకం మిర్చి 11 బస్తాలు మార్కెట్‌కు తీసుకువచ్చాడు. మాధవి అడ్తి కమీషన్ ఏజెంట్ ద్వారా సీపీసీ ట్రేడర్స్ ఖరీదు వ్యాపారి క్వింటాల్‌కు రూ.28వేల 500లతో కొనుగోలు చేశాడు. గత సంవత్సరం వండర్‌హాట్‌కు మిర్చి సీజన్ ప్రారంభంలో రూ.25వేల నుంచి రూ.36వేల ధర పలికినట్లు ఎనుమాముల మార్కెట్ వర్గాలు తెలిపాయి.



శోభాయాత్రలో పాల్గొన్న అయ్యప్పస్వాములు, భక్తులు

## కనుల పండుగలా శోభాయాత్ర

కరీమాబాద్, డిసెంబర్ 7: నాగమయ్య కుటీరం, అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో బుధవారం రాత్రి అయ్యప్పస్వామి శోభాయాత్రను కనులపండువగా నిర్వహించారు. ఉర్సులోని నాగేంద్రస్వామి ఆలయ సమీపంలో ప్రారంభమైన శోభాయాత్ర పురవీధుల గుండా ఉర్సు నాగేంద్రస్వామి ఆలయం వద్ద ఏర్పాటు చేసిన కుటీరానికి చేరుకుంది. ఈ సందర్భంగా మహిళలు మంగళహారతులతో ఘన స్వాగతం పలికారు. దేవతామూర్తుల వేషధారణలో కళాకారులు ఆకట్టుకున్నారు.



ప్రత్యేక అలంకరణలో అయ్యప్ప స్వామి ఉత్సవమూర్తి